



# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక







కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 ఆదివారం 27-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వేల : 04


## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'.. బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా
- బ్రిటన్ సైనిక స్థావరాలపై దాడి చేస్తామంటూ సంకేతాలు
- బ్రిటన్, ఫ్రాన్స్ 'నిప్పుతో చెలగాటం' ఆడుతున్నాయని వ్యాఖ్య
- ఉక్రెయిన్‌లో స్టార్మ్ షాడో తయారీకి మార్గం సుగమం



ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం- మిగతా 2 లో

## ఐరాసలో ఖాళీ సీటులో సులేమానీ ఫొటో

- నెతన్యాహూ ప్రసంగం వేళ ఇరాన్ సంచలన నిరసన!
- నెతన్యాహూ ప్రసంగానికి ఇరాన్ ప్రతినిధుల బహిష్కరణ
- సీటులో సులేమానీ ఫొటో ఉంచిన ఇరాన్
- 2020లో అమెరికా డ్రోన్ దాడిలో సులేమానీ మృతి
- పలుదేశాల ప్రతినిధులూ సభ నుంచి బయటకు
- నెతన్యాహూపై విమర్శలు చేసిన పలువురు నేతలు



### గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల- మిగతా 2 లో

# సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు



2లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్

### వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది



- సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత
- అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు
- ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన - మిగతా 2 లో

### అమెరికా నుంచి 'ఫైర్ అండ్ ఫర్గెట్' జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

- జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్
- ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు
- భారత సైనిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు



సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. - మిగతా 2 లో

### శ్రీవారి దర్శనానికి భారీ నిరీక్షణ నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లు



- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు, బయట బారులు
- గురువారం రూ.4.45 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తడంతో తిరుమల కొండపై రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ సిబ్బంది నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ఇక నిన్న (గురువారం) మొత్తం 66,437 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 26,771 మంది తలనీలాలు సమర్పించారు.

# 'లేక్ ఒంటారియో' పేరు మార్పు 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

- సరస్సు పరిరక్షణలో అమెరికాదే కీలక పాత్ర అని వెల్లడి
- 30 రోజుల్లోగా పేరు మార్పు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- ఈ మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికే వర్తింపు
- గతంలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును కూడా మార్చిన వైనం



2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన 'లేక్ ఒంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మారుస్తూ కార్యనిర్వాహక

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు: సీఎం చంద్రబాబు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



2లో

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

### పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ - మిగతా 2 లో

### పదోసారి సవాల్ చేస్తున్నా



- డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ: నారా లోకేశ్
- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ

"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, - మిగతా 2 లో

# పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

మొదటిపేజీ తరువాయి – హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు

మొదటిపేజీ తరువాయి – ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు. ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్‌ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే. ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్‌ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

మొదటిపేజీ తరువాయి – అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

మొదటిపేజీ తరువాయి – నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్–1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్–2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'.. బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి – అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్–రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.ఇదే సమయంలో రష్యా–నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

# 'లేక్ ఒంటారియో' పేరు మార్పు.. 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

మొదటిపేజీ తరువాయి – ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ సరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30 రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా అంతర్గత వ్యవహారాల కార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను ట్రంప్ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా వివరించారు. "గ్రేట్ లేక్స్ పరిరక్షణలో అమెరికానే గొప్ప సంరక్షకుడిగా ఉంది. అమెరికా అందిస్తున్న భద్రత, పెడుతున్న పెట్టుబడులు లేకపోతే ఈ మంచినీటి వ్యవస్థ నౌకాయానానికి, వినోదానికి ఈ స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు" అని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో గ్రేట్ లేక్స్ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ కోసం అమెరికా దాదాపు 4 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టిందని, కెనడా పెట్టుబడులు చాలా తక్కువని ఆయన అన్నారు. గ్రేట్ లేక్స్‌లో మంచును తొలగించే 11 నౌకల్లో 9 అమెరికా కోస్ట్ గార్డ్ నిర్వహిస్తున్నవేనని గుర్తుచేశారు. చారిత్రకంగా, వాణిజ్యపరంగా, రక్షణాపరంగా కూడా ఈ సరస్సు అమెరికాకు ఎంతో ముఖ్యమని ట్రంప్ తెలిపారు. న్యూయార్క్‌లోని ఓస్వెగో చారిత్రక కోటగా, సెయింట్ లారెన్స్ సీవే నుంచి అమెరికాలోకి వచ్చే మొదటి ఓడరేవుగా నిలిచిందని ప్రస్తావించారు. ఈ సరస్సు నీటిని తాగునీటి అవసరాలకు, విద్యుత్ ప్లాంట్లకు వినియోగిస్తున్నారని, లక్షలాది అమెరికన్ల ఉద్యోగాలకు ఈ ప్రాంతం ఆధారమని తెలిపారు. అయితే, ఈ పేరు మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వ వినియోగానికి మాత్రమే వర్తిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ పటాలు, పత్రాలు, ఒప్పందాలు, అధికారిక సమాచారంలో మాత్రమే 'లేక్ అమెరికా' అనే పేరును వాడతారు. కెనడా, అంటారియో ప్రావిన్స్, అంతర్జాతీయ సంస్థలు లేదా ప్రైవేట్ మ్యాప్ ప్రొవైడర్లు ఈ కొత్త పేరును ఉపయోగించాల్సిన అవసరం లేదు. ట్రంప్ ఒక భౌగోళిక ప్రాంతం పేరు మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025 జనవరిలో 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో' పేరును ఫెడరల్ అవసరాల కోసం 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ఆయన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019–24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పదోసారి సవాల్ చేస్తున్నా

మొదటిపేజీ తరువాయి – టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

### డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్–1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

### స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు.

మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

### మరో మూడుసార్లు గెలవాలి

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

### జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



మొదటిపేజీ తరువాయి – వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్లు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నుంచి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు

మొదటిపేజీ తరువాయి – నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతుయాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలుబాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయంనేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు–ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్–టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీ) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని



సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80–100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది

మొదటిపేజీ తరువాయి – వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు



నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 26 :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నెక్కొండ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హైస్కూల్ సెంటర్ లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె చేసిన పోరాటాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విగ్రహ దాత చల్ల రఘోత్తం రెడ్డి, స్టీల్ రెయిలింగ్ దాత తాటిపెల్లి శివ కుమార్ హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక కుల పెద్దలు రామారపు వీరస్వామి, రామారపు లక్ష్మీనారాయణ, రామారపు భద్రయ్య, రామారపు శిరీష రాము, బొడ్డుపెల్లి రాజు, రామారపు విజయ్, పొట్లపల్లి వీరస్వామి, రామారపు రఘు, బండి రామస్వామి, బొడ్డుపెల్లి శ్రీశైలం, పొట్లపల్లి సురేష్, పైండ్ల వీరయ్య, బండి నరేష్, గాద భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు కు అదనపు కోర్టు కేటాయింపుహర్షనీయం మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రకాని గురుకృష్ణ






**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ- పినపాక నియోజకవర్గం ప్రతినిధి- వల్లెపోగు రాము) మణుగూరు సెప్టెంబర్ 26 :-** మణుగూరు కోర్టుకు అదనపు కోర్టును కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం పై మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రకాని గురుకృష్ణ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ... మణుగూరు ప్రాంతంలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ఎంతో దోహద పడుతుందని అన్నారు అదనపు కోర్టు ఏర్పాటుతో కక్ష దారుల సమయం వ్యయ ప్రయాసలు తగ్గడంతో పాటు త్వరితగతిన న్యాయం అందే అవకాశం ఉంటుందన్నారులి మణుగూరు ప్రాంతీయ అవసరాలను గుర్తించి అదనపు కోర్టు మంజూరు కొరకు చొరవ చూపిన శ్రీ జస్టిస్ జె. శ్రీనివాస్ రావు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్ట్‌ఫోలియో, జడ్జిశ్రీమతి జి. ప్రేమలత,స్థానిక పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మరియు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత - ఒకరి అరెస్ట్



**పోరు తెలంగాణ నెక్కొండ, సెప్టెంబర్ 26 :** అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నెక్కొండ పోలీసుల తో కలిసి పనికర గ్రామంలో ని గర్నపల్లి జితేందర్ రెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో 100 బస్తాలు (50 క్వింటాళ్ళు) విలువ రూ.1,75,500/- ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గర్నపల్లి జితేందర్ రెడ్డి (40 సం.) ను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు నెక్కొండ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఏసీపీ ఎ. మధుసూదన్, ఇన్ స్పెక్టర్ జి. సుబ్బారెడ్డి, ఎస్.ఐ బి. ఉప్పలయ్య మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు



**మహేశ్వరం, సెప్టెంబర్ 26, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం నియోజకవర్గం కేంద్రంలో భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ 94 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన్మోహన్ సింగ్ ఈ దేశానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారు గల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ లు కర్రోల్ల రాములు ముదిరాజ్, దోమ శ్రీనివాసరెడ్డి, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యాల దేవేందర్, సీనియర్ నాయకులు గదగూటి జంగయ్య ముదిరాజ్, రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, సోషల్ మీడియా మాజీ కో-ఆర్డినేటర్ ఏపూరి నరసింహ, మహేశ్వరం పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ గంటి ఆకాష్, మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇన్చార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్, 14 వ వార్డు ఇన్చార్జ్ పుట్ల గారి చందు, నాయకులు హనుమంత్ రెడ్డి, పినమొని శ్రీకాంత్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసాగర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి



**మహేశ్వరం, సెప్టెంబర్ 26, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు కే. విద్యాసాగర్ 4 వ వర్ధంతి కార్యక్రమం రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. విద్యాసాగర్ గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎంతోమంది యువ నాయకులను తయారు చేసి అంబేద్కర్ సిద్ధాంతాలు మరియు ఆలోచన విధానం వైపు నడిపించినటువంటి గొప్ప నాయకుడు గొప్ప మానవతావాది ఇటువంటి నాయకుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడు అని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ప్రభు రాష్ట్ర కార్యదర్శి దుప్పాడ అప్పలరాజు కోశాధికారి బాపనపల్లి ప్రమోద్ కుమార్ ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు తెల్లారి సునీల్ కుమార్ తెలంగాణ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం మధుసూదన్ గారు స్థానిక పంచాయతీ కమిటీ అడ్వైజర్ గొర్ల వినయ్ కుమార్ కే లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం అజయ్ కృష్ణ జై భీమ్ మహిళా అసోసియేషన్ అధ్యక్షురాలు అంజలి, భారతి పాల్గొన్నారు.

## హౌసింగ్ స్కీం లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలి బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు మల్లెల రవి చందర్



నిర్లక్ష్యం, పక్షపాతం, అన్యాయానికి తావు చేయాలని మల్లెల రవి చందర్ డిమాండ్ చేశారు

**కొత్తగూడెం సెప్టెంబర్ 26 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ఈనెల 24వ తారీఖున నిర్వహించిన హౌసింగ్ స్కీం లబ్ధిదారుల ఎంపిక, లాటరీ ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్లెల రవిచందర్ఆరోపించారు అర్హులైన పేదలను ఎవరు గుర్తించారు? ఏ ప్రాతిపదికన లబ్ధిదారుల జాబితా రూపొందించారు? స్థానిక కార్పొరేటర్లకు కూడా సమాచారం లేకుండా జాబితాను ఎక్కడ, ఎలా తయారు చేశారు? అర్హులైన నిరుపేదల పేర్లు జాబితా నుంచి తొలగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ పేర్లు ఎందుకు తొలగించబడ్డాయి? ఎవరి ఆదేశాలతో తొలగించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలి. లాటరీలో చీటీలు డబ్బాలో వేసే సమయంలో లబ్ధిదారులకు, విలేకరులకు కూడా చూపించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో లాటరీ ప్రక్రియ పారదర్శకతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాలను అధికారులు స్పష్టంగా నివృత్తి చేయాలి. గతంలో నిర్మాణం ప్రారంభమైన ఇళ్లు ఇప్పటికీ పూర్తికాకుండా ఉన్న పరిస్థితిపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది? లబ్ధిదారులకు ఎప్పుడు అందజేస్తారు? స్పష్టం చేయాలి.

**ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాలి**

హౌసింగ్ స్కీం లబ్ధిదారుల ఎంపికలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలు, పేర్ల తొలగింపు, లాటరీ ప్రక్రియలో పారదర్శకతపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలి. విచారణలో తప్పులు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి. బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అర్హులైన పేదల పేర్లను తిరిగి పరిశీలించి, నిస్పక్షపాతంగా కొత్త అర్హుల జాబితా రూపొందించి నిజమైన లబ్ధిదారులకు ఇల్లు అందించాలి పేదల ఇళ్ల విషయంలో

## అశ్వాపురం ఎస్సీ కాలనీలో విజృంభిస్తున్న విషజ్వరాలు

వెంటనే హెల్త్ క్యాంప్ నిర్వహించాలి

ఇంటింటి సర్వే చేపట్టి మందులు పంపిణీ చేయాలి.

బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ...

**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజవర్గ ప్రతినిధి అశ్వాపురం సెప్టెంబర్ 26:-** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో అధికారులు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. కాలనీలోని పలు కుటుంబాల్లో జ్వరం, జలుబు, గొంతునొప్పి వంటి అనారోగ్య సమస్యలతో ప్రజలు బాధపడుతున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు మెడికల్ దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు మరింత విస్తరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకముందే అధికారులు కాలనీలోకి వచ్చి వైద్య సేవలు అందించాలి. ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన వారికి అక్కడికక్కడే మందులు అందించాలి" అని రామకృష్ణ కోరారు. పంచాయతీ, వైద్యారోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించి, జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలని సూచించారు. అలాగే కాలనీలో పారిశుధ్య లోపాలు, నిల్వ నీరు, దోమల సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. "జ్వరాలు ముదిరిన తర్వాత స్పందించడం కంటే.. వ్యాధులు వ్యాప్తి చెందకముందే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. ఎస్సీ కాలనీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలి" అని గద్దల రామకృష్ణ కోరారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు కళాకారుల మౌన దీక అధికారులు స్పందించకపోతే ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తాం

సంబంధిత కార్యాలయాలను ముట్టడిస్తాం.

రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తాం.

**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి :** మెటుపల్లి పట్టణం: శనివారం ఉదయం పట్టణంలోని చావిడి చౌరస్తాలో అంబేద్కర్ మహాశయుని విగ్రహానికి పూలవేసి నివాళులర్పించిన కళాకారులు అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు వారు ఏర్పాటు చేసుకున్న దీక్ష శిబిరానికి చేరుకున్న సుమారు 100 దీక్ష చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణదారులపై తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని హితవుపలికారు. లేనియెడల పట్టణంలోని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తాలో భారీ ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తామని, అలాగే రిలే నిరాహార దీక్షలు కూడా చేపడతామని కళాకారులు తెలిపారు. . ఈ కార్యక్రమంలో మెటుపల్లి డివిజన్ సాధన సమితి అధ్యక్షులు తోకల సత్యనారాయణ, నాంపల్లి గట్టయ్య, దేశీరాజు దేవలింగం, జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక కన్వీనర్ కోటగిరి వెంకటస్వామి, ఇల్లెందుల కృష్ణమాచారి, లలిత కళా సమితి అధ్యక్షులు గోధూరు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య మగ్గి భాస్కర్, కార్యవర్గ సభ్యులు వర్మ, శేఖర్ మాస్టర్, అనిల్ మాస్టర్, బండి రవి, శేఖర్, దశరథం, సోమ భూమన్న, మెట్టు భూమన్న, నర్సయ్య, రొయ్య నర్సయ్య, ఎర్ర గంగారం, బండి ముత్యాలు, కంచు ఎర్రన్న, బర్మా రమేష్, అనంతం, శ్రీనివాస రఘుపతి, శ్రీధర్, రాజు, రాజారావు బ్రహ్మయ్య, శ్రీనివాస, భాస్కర్, విజయులు, నర్సయ్య, విష్ణు, శ్రీధర్, రాజన్న, లింగం, సంకు అశోక్, రాజేందర్ పాల్గొన్నారు



## ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు నిరంతర పోరాటం

22ఏ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలి కేటీపీఎస్ లో 2ఐ800 మెగావాట్ల యూనిట్లు ఏర్పాటు చేయాలి

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 26(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** భద్రాద్రి జిల్లా ఇన్‌ఛార్జ్‌గా కాల్వ భాస్కర్‌రావు నియామకం కొత్తగూడెం/పాల్వంచ: ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఆల్ ఇండియా ఎస్సీ/ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ (ఏ ఐ ఎస్ సీ టీ ఆర్ పి టి) గత 65 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ లేబర్ చట్టంలో రిజర్వేషన్ అమలు కోసం పోరాటం చేయడంతో పాటు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ భవన్ నిర్మాణానికి ఎకరం స్థలం సాధించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, సామాజిక న్యాయం కోసం భవిష్యత్తులోనూ ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

**జిల్లా ఇన్‌ఛార్జ్‌గా కాల్వ భాస్కర్‌రావు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌ఛార్జ్‌గా కాల్వ భాస్కర్‌రావును నియమించినట్లు సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలు, బ్రాంచ్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అక్టోబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆయనకు సూచించినట్లు తెలిపారు. పాల్వంచ నూతన కమిటీ ఏర్పాటుకు కూడా బాధ్యతలు అప్పగించామని, కమిటీలలో యువత, మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

**22ఏ భూముల సమస్యను పరిష్కరించాలి**

22ఏ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 22ఏ భూములను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొంటూ, సుమారు 3 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, నిరుపేద రైతులకు భూములపై హక్కులు కల్పించాలని కోరారు.

**కేటీపీఎస్ లో 2ఐ800 మెగావాట్ల యూనిట్లు ఏర్పాటు చేయాలి**

కేటీపీఎస్ లో రద్దు చేసిన ఎనిమిది యూనిట్ల స్థానంలో తక్షణమే 2ఐ800 మెగావాట్ల నూతన విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ప్రజా ఉద్యమాలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రిటైర్డ్ జేఏఓ కొలిపాక ఆనందరావును టీజీ జెన్కో ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కాల్వ భాస్కర్‌రావు, కాల్వ ప్రకాష్‌రావు, ఎం. రాజేంద్రకుమార్, వాసిముల్ల సుందర్‌రావు, కాసిముల్ల ఆనందరావు, కాల్వ రామారావు, కాలే పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫరీద్‌పేటలో నిధుల దుర్వినియోగం కలెక్టర్ సీరియస్

సర్పంచ్, ఉప సర్పంచ్‌ల చెక్ పవర్స్‌పై ఆంక్షలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి :సెప్టెంబర్ 26.(పోరు తెలంగాణ న్యూస్) :** నాకామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామపంచాయతీ పరిపాలనలో నిధుల వినియోగంలో వ్యత్యాసాలు, నిబంధనల ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు చేపట్టారు. ఫరీద్‌పేట జీపీలో నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఐదుగురు వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా జారీ చేసిన షోకాజ్ నోటీసులపై సర్పంచ్ జిడిపల్లి నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ బాలా గౌడ్ సమర్పించిన వివరణలను అధికారులు పరిశీలించగా అవి సంతృప్తికరంగా లేవని. దీంతో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 సెక్షన్ 70(4) ప్రకారం సర్పంచ్, ఉప సర్పంచ్‌ల సంయుక్త చెక్-డ్రాయింగ్ అధికారాలపై ఆంక్షలు విధిస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఇకపై పంచాయతీ కార్యదర్శి సమర్పించే అన్ని బిల్లులు, వోచర్లను పాల్వంచ మండల పంచాయతీ ఆఫీసర్(ఎంపీవో) పరిశీలించి ధృవీకరించిన తర్వాతే, గ్రామ సభ మరియు గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకు సంయుక్త సంతకాలతో చెక్కులు జారీ చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## యువ యూత్‌కు కొత్త నాయకత్వం

నూతన కమిటీ అధ్యక్షుడిగా కోడరి రాజు



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 26 :** యువతను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి సామాజిక, క్రీడా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో యువ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోదరి రాజు, ఉపాధ్యక్షుడిగా కర్నాల అఖిల్, ప్రధాన కార్యదర్శిగా రాకం ప్రశాంత్, కార్యదర్శిగా రాకం ప్రశాంత్ (ఉపేందర్ కుమారుడు), కోశాధికారిగా తాడేం వంశీ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా తాడేం మహేష్, గేమ్స్ సెక్రటరీగా కుక్కల విరాజ్, సోషల్ మీడియా ఇన్చార్జిగా రాకం రాకేష్ బాధ్యతలు చేపట్టారు. ముఖ్య సలహాదారులుగా కుక్కల సతీష్, సాదబోయిన శ్రీకాంత్, మేడబోయిన రామకృష్ణ, సదాబోయిన హరీష్, కాటా శ్రీకాంత్, రాకం ప్రదీప్‌లను ఎంపిక చేశారు. కొత్త కమిటీకి పలువురు యూత్ సభ్యులు అభినందనలు తెలిపారు. గత మూడేళ్లుగా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన తాడేం వినయ్‌కు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సలహాదారులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ధీరజ్ మోహన్ గుప్తా జ్ఞాపకార్థం విద్యార్థులకు అన్నదానం





**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి–వల్లెపోగు రాము) మణుగూరు సెప్టెంబర్ 26:–** పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషన్ చారిటీ ట్రస్ట్‌లో శనివారం 90 మంది విద్యార్థులకు అన్నప్రసాద భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కీర్తిశేషులు బచ్చు ధీరజ్ మోహన్ గుప్తా జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లక్ష్మీ ఫ్యాన్సీ నిర్వాహకులు స్వరాజురావు, జయశ్రీ దంపతుల కుమారుడైన ధీరజ్ మోహన్ గుప్తా జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భోజనం వడ్డించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, కోటగిరి సందీప్, రేపాక సత్యనారాయణ, వీరభద్రరావు, నాగుబండి వెంకన్నతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ట్రస్ట్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండ మండల కేంద్రంలో మాజీ ప్రభుత్వ విప్ అనిల్ ఈరవత్రి జన్మదిన వేడుకలు

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రభుత్వ విప్ అనిల్ ఈరవత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, బాల్కొండ మండల కేంద్రంలోని "వీ" కన్వెన్షన్ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు గోర్త రాజేందర్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేయడమే కాకుండా, అత్యవసర సమయంలో అనేక ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. రక్తదాన శిబిరానికి స్పందించి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# నాగంపేట్ గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రైతాంగ పోరాటంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, కార్యదర్శి కవిత, వార్డ్ సభ్యులు చంటి, నారాయణ, గంగామణి, ముత్తెన్న, రవికుమార్, ఎఫ్ ఏ గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడు వినయ్, ప్రశాంత్, పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వాడీ సూపర్ వైజర్ మాదవి, అంగన్వాడీ టీచర్ లు, హెల్త్ డిపార్ట్మెంట్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.63 వేల లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన మెట్‌పల్లి సీడీపీఓ



**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి రూ.63 వేల లంచం తీసుకుంటూ మెట్‌పల్లి సీడీపీఓ పద్మ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మెట్‌పల్లి అర్బన్ సెక్టార్ పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసే సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు నమోదు చేయకుండా అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నుంచి నెలకు రూ.1,000 చొప్పున, మూడు నెలలకు రూ.3,000 చొప్పున 21 కేంద్రాలకు కలిపి మొత్తం రూ.63,000 లంచం ఈ ట్రాప్ లో భాగంగా ఫిర్యాదుదారుడి నుంచి రూ.63,000 లంచం నగదు మొత్తాన్ని అధికారిణి నేరుగా స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కరీంనగర్ రేంజ్ ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీ గౌర్రె మధు ఆధ్వర్యంలో శనివారం ఈ ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఆమె వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని సీడీపీఓ పద్మను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట జ్యుడిషియల్ రిమాండ్ కోసం హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## వీరనారి చాకలి ఐలమ్మ

# జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**కొత్తగూడెం సెప్టెంబర్ 26 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటిదాసు :** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శ్రీ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ గారి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ, పేదలు బలహీన వర్గాల ప్రజల కోసం ఆమె చూపిన పోరాట పటిమ, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆమె జయంతి సందర్భంగా తెలంగాణ సమాజం మొత్తం ఆమె సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## నిర్వాహకులకు అభినందనలు తెలిపిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, సెప్టెంబర్ 26(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** గణేష్ నవరాత్రి మహోత్సవాలను కొత్తగూడెం నియోజకవర్గంలో ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన నిర్వాహకులను డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అభినందించారు. పాత పాల్వంచలో టీయువ శక్తి యూత్, తూర్పుబజార్ సనాతన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు శోభాయాత్రలో కొత్వాల శ్రీనివాసరావుతో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొన్నారు. శోభాయాత్ర సందర్భంగా కొత్వాల డ్యాన్స్ చేస్తూ యువతను, భక్తులను ఉత్సాహపరిచారు. కార్పొరేటర్ విమలాదేవి కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ, అసాంఘిక సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. గణేష్ ఉత్సవాలు భక్తి, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచాయని కొత్వాల పేర్కొన్నారు.

# కిష్టాపూర్ లో కల్వర్టు వెడల్పు పెంచాలని సర్పంచ్ పోరాటం




గ్రామ పంచాయతి కార్యాలయము -కిష్టాపూర్
సెల్: 6281120037

**పోరు తెలంగాణ,మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26 :** మంచిర్యాల – వరంగల్ నాలుగు వరుసల జాతీయ రహదారి (ఎన్ హెచ్ –163 జి, గ్రీన్ ఫీల్డ్ హైవే ) పనులు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. కిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గోదావరి వైపు, స్మశాన వాటిక దారిలో నిర్మిస్తున్న కల్వర్టును కేవలం మూడు మీటర్ల ఎత్తుతో మమ అనిపించేందుకు అధికారులు సిద్ధమవ్వడంపై రైతులు భగ్గుమంటున్నారు. మూడు మీటర్ల ఎత్తులో వరి కోత యంత్రాలు, ట్రాక్టర్లు, ట్రాలీలు పొలాల్లోకి వెళ్లడం అసాధ్యమని, ఇది ముమ్మాటికీ రైతుల నోట్లో మట్టి కొట్టడమేనని సర్పంచ్ దుర్గం మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ జాతీయ రహదారుల శాఖ ప్రాజెక్టు సంచాలకులకు ఘాటుగా లేఖ రాశారు. రైతుల బతుకులతో ఆటలాడవద్దని, కల్వర్టును కనీసం ఆరు మీటర్ల వెడల్పు, నాలుగున్నర మీటర్ల ఎత్తుతో నిర్మించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ దుర్గం మహేష్ తో పాటు , గ్రామ రైతులు తమ ఆవేదనను, ఆగ్రహాన్ని సంతకాల రూపంలో జత చేసి అందజేశారు. రైతులకు నష్టం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# బ్యాంకు సమ్మెతో లాభం నష్టం ఎవరికి?

## తెలంగాణ శ్రీనివాస్ నాయక్



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 26 :** యావత్ భారతదేశం లో ఉన్న ఏడు ప్రతినిధుల సంఘాలు.. ఎనిమిది లక్షలకు పైగా బ్యాంకింగ్ సిబ్బందులకు ప్రాతినిధ్యం వహిస్తున్న యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ( యు ఎఫ్ బి యు ) ఈనెల 28 నుండి మూడు రోజులపాటు సమ్మెకు పిలుపునివ్వడంతో లాభం నష్టం ఎవరికి ఈ సమాధానం కేంద్ర ప్రభుత్వం తెలుపాలని సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత, నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ ప్రశ్నించారు బ్యాంకు ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ విఫలమయ్యారని అన్నారు వారానికి ఐదు రోజులు సెలవులు ఇస్తే అదనంగా 50 నిమిషాల పాటు మరో రోజు పని చేస్తామని ఉద్యోగస్తులు స్పష్టం చేస్తున్న కూడా ప్రభుత్వ వైఖరి మారకపోవడం విచారకరమన్నారు ఆర్.బి.ఐ, ఐఆర్డీఏఐ, సెంట్రల్ గవర్నమెంట్, ఐటి రంగాల్లో ఐదు రోజుల పని దినాలు అమలు చేస్తున్నారని అంతేకాదు 2024 మార్చి వేతన ఒప్పందం సమయంలో ఐదు రోజుల బ్యాంకింగ్ సూత్రపాయంగా సంతకాలు జరిగాయని ప్రభుత్వం ఇప్పుడు మొండి వైఖరితో బ్యాంకు ఉద్యోగస్తులను ఇబ్బందులు గురి చేస్తుందని దీని మూలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడి, సిబ్బంది కొరత, ఆరోగ్యం కుటుంబ సమతుల్యత దెబ్బతింటున్నాయని తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజల కు చిన్న, సన్నా కార వ్యాపారులకు ఇలా అనేక రకాలుగా ప్రతికూల అంశంగా మారబోతుందని తక్షణమే సామరస్యంతో వారి డిమాండ్ లను పరిష్కరిస్తూ యధావిధిగా బ్యాంకులు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ విజ్ఞప్తి చేశారు లేనిపక్షంలో బ్యాంకు సిబ్బంది సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మద్దతుగా ఉంటామని హెచ్చరించారు

# గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పాయం

## వెంకటేశ్వర్లును కలిసిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



**కొత్తగూడెం సెప్టెంబర్ 26 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణ రాష్ట్రంలోని గెస్ట్ కాంట్రాక్ట్ లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్లకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. గెస్ట్ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం లభించేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

# గిరిజన సంక్షేమ సమస్యలపై సమగ్ర చర్చ

## గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్ పాయంవెంకటేశ్వర్లు



**కొత్తగూడెం సెప్టెంబర్ 26 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణ శాసనసభ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన 2026--27 సంవత్సరానికి సంబంధించిన కమిటీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్ నెం.1లో నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బాలు నాయక్ నేనావత్, ఎమ్మెల్యే డా. మురళి నాయక్ భూక్యా, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పింగిలి పాల్గొన్నారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఉన్నతాధికారులు సభ్యసాచి ఘోష్, ఐఏఎస్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సంతోష్ బి.ఎం., ఐఏఎస్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, ఎస్. సీతా లక్ష్మి, ఐఏఎస్తో పాటు గురుకులం, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుకులం మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి రాష్ట్రంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, గిరిజన సంక్షేమ పథకాల అమలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కమిటీ సభ్యులు సమగ్రంగా చర్చించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్టీఎస్డీఎఫ్) కింద కేటాయించిన నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో గిరిజనులకు అమలవుతున్న రిజర్వేషన్ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు.

# ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం సెప్టెంబర్ 26 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన చిన్న నల్లబల్లి గ్రామం పానుగంటి లక్ష్మీ భవానికి రూ.27,000 విలువైన చెక్కును, పెద్ద నల్లబల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకన్నకు రూ.54,500 విలువైన చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపద సమయంలో ప్రభుత్వం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యం, వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, చింతాడి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

